


# కనిపించని చేతులు * సత్యం

అగ్గిపెట్టెలాంటి అండర్‌గ్రౌండ్ రూమ్‌లో పెద్దిరెడ్డిగారు ఆలోచనల్లో మునిగి పోయారు. పెద్దిరెడ్డిగారంటె ఆ ఊరు రెడ్లందరిలోకి పెద్దవాడు. సమస్యలతో సతమతమవుతున్నప్పుడు పెద్ద భవంతి లాంటి దివాణంలో ఫంకా కింద నిల్చున్న పెద్దిరెడ్డిగారు పడుతున్న చెమటను తుడవలేక టవల్లు తడిసి ముద్దయ్యేవి మరి ఈ అగ్గిపెట్టెలాంటి చిన్న రూమ్‌లో పెద్దిరెడ్డిగారి అవస్థ......గాభరాపెడ్తున్న విషయాలను పక్కకు నెట్టాలని యమయాతనపడ్తున్నాడు, ఉహూ! సాధ్యపడలేదు.

ఆర్నెయ్యావ్వం. సస్తే గోరీకి గూడ జాగా గతిలేసి గాండ్డి కొడుకు, నన్ను, ఈ ఊరిపెద్ద నెదిరించడమే. ఆఖ్రికి లంబాడీ 'నాకొడుకు' భుక్యాగాడు నామీదిక్కి మర్లవడ్తడా?

'అలాంటి అభాగ్యులకు ఉండేందుకు చోటు చస్తే చూసుకునే తన రక్త సంబంధీకులు, కట్టుకుని చూసి మురిసిపోయేందుకు గోరీలు ఉండవని పెద్దిరెడ్డిగారికిప్పుడు గుర్తుకు రావడం లేదు.

పోపీ వాడు తిరగబడ్డా తిరగబడ్డది గాక నేను చెప్పినోనికిగాక వేరోన్కి ఓటేస్తాడా? ఏసిండే అనుకో ఇంక పది మందితోటి ఏపిస్తడా? అన్కిపొయ్యే కాలం గాకపోతే నా మీద తిరగవడ్తడు లంజాకొడుకు?

ఆలోచనలతో పెద్దిరెడ్డి బుర్రవేడెక్కింది. మొన్నంటె మొన్న "మీకాల్మొక్త దొర ఏడవాయిన పని దొరుకుతలేదు. ఏదో గింత పొలంల పని సూపెట్టుండ్రి" అనొచ్చిన లక్ష్మి కొడుకు ఇయ్యాలంటె ఇయ్యాల కూలో

ల్లందరికి పెద్దయి నాకే ఎదురు తిరుగుతాడు. అదే మనుకున్నడో ఏమో పెద్దిరెడ్డి అంటె పెద్దపులని తెలవదేమో, అని అయ్యలు గూడ మాతాన పని జేసింద్రు, మేం జెప్పినట్లిన్నరు. మంచిగ మా కండ్లముందు బతికిండ్రు. ఈనికేదో సెడిపొయ్యే రోజులొచ్చినయ్. భూత్ ఈన్యమ్మ, మధ్యలో ఉమ్మొచ్చి ఉమ్మేసాడు పెద్దిరెడ్డి.

నిజానికయితె పెద్దిరెడ్డి ఏ విషయాన్నయినా ఇంత తీవ్రంగా ఆలోంచించడు. కాని ఈ విషయమేదో పీకల దాకా వొచ్చినట్లుంది.

పెద్దిరెడ్డి దృష్టిలో మంచిగ మా కండ్ల ముందు అంటె ఏమిటో భుక్యాకు బాగా తెలిసొచ్చింది. కొద్దికొద్దిగా పెద్దిరెడ్డి పెద్దరికంలోని ఆంతర్యం తెలుస్తున్న కొద్ది ధైర్యం చేసి భుక్యా తన వాళ్లందరిని కూడగట్టుకుని తన తండ్రులూ తాతలూ రెక్కలు ముక్కలు చేసుకుని పెద్ద వాళ్ల ఇండ్లు ఎలానింపారో చెప్పడం ప్రారంభించాడు. ఈ పరిస్థితుల్లో తాను ఏమీ చేయలేకపోయినా కూలీలను కూడగట్టి పిడికెడు మెతుకుల కోసమని కూలీరేటు పెంచాలని పట్టుబట్టాడు. అటు పెద్దిరెడ్డికి ఇటు భూక్యాకు పంతాలు పెరిగిపోయాయి వాటి మూలంగా.

సరిగ్గా ఈసమయంలోనె ఎన్నికలొచ్చాయి భూక్యాకు రాజకీయాల గూర్చి ఏమీ తెలియక పోయినా మొండిగా పెద్దిరెడ్డి, తదితర భూస్వాములు బలపరచిన అభ్యర్థికి వ్యతిరేకంగా ఓటువేసి, తన వాళ్లందరితో వేయించి చిత్తుగా ఓడించారు. దీంతో పెద్దిరెడ్డికి భూక్యామీద పగ చెలరేగింది.

రెడ్డిగారి మస్తిష్కం వేడెక్కిపోతుంది. జరిగిపోయిన సంఘటనలన్నీ ఒక్కొక్కటే కళ్లముందు సినిమా రీళ్లలా తిరగసాగాయి. పెద్దిరెడ్డి వొళ్లు బిగుసుకుపోయి నోటివెంట అప్రయత్నంగా బూతులు రాసాగాయి.

కమ్జాత్ గాళ్లంత ఒక్కటై నావోన్ని వోడగొడ్తరా? ఈ పెద్దిరెడ్డి ఊరుకుంటడనుకున్నరేమో, నేనెందుకూరుకుంట? నా వోళ్లందరికి ఎగేసిన. అంతే భంచోత్, అంతయిపొయ్యింది, అందరుగలిసి ఆనింటిమీదికి కట్టెలతోటి, కత్తులతోటి, గొడ్డండ్లతోటి పొయ్యింద్రు-ఆ భూక్యాగాని చేతులు తెగనరికింద్రు, మంచిగయింది ఆ లంబాడి నా కొడుక్కి గట్లనె గావాలి,

పెద్దిరెడ్డి భీకరంగా నవ్వుకుంటున్నాడు. అతడి మొహంమీద విపరీతమయిన చమట పట్టింది. ఒళ్లు ఆవేశంతో ఊగిపోసాగింది, అప్పుడే అతడికి తానుంటున్నది అండర్ గ్రౌండ్‌లోని అగ్గిపెట్టెలాంటి గదని గుర్తొచ్చింది.

పెద్దిరెడ్డి వందల ఎకరాల అధిపతీ లక్షల శ్రీమంతుడూ కాకపోయినా ఆ ఊరంతటికీ మోతుబరి- రాజకీయంగా బాగా పలుకుబడి గల వాడు. ఇతర భూస్వాములతో పోల్చుకుంటె పెద్దిరెడ్డి పిచ్చుకే. అయినా తాను రెడ్డన్న అహం అతడి నరనరాల్లో జీర్ణించుకుపోయింది- తరతరాలుగా బానిస బ్రతుకులు బ్రతుకుతూ తమ ఊడిగం చేస్తున్న బంజారాలు పెద్దిరెడ్డి కళ్లకు పశువుల కన్నా హీనంగా కన్పిస్తున్నారు.

గర్వంతో నవ్వుకుంటున్న పెద్దిరెడ్డికి తాము చేసిన దౌర్జన్యానికి ఫలితమేమిటో వెంటనే తెలిసొచ్చింది. తాలుకా హెడ్‌క్వార్టర్స్‌లో కొత్తగా పెట్టిన పోలిసు ఔట్‌పోస్ట్ సబినస్పెక్టర్ చాలా స్ట్రిక్ట్ మనషి అతను వొచ్చీరావడంతోనె పెద్దిరెడ్డి మనుషులిద్దర్ని అరెస్ట్ చేసి తీసుకెళ్ళాడు. కనీసం అప్పుడయినా తను వాళ్లకు చిక్కనందుకు పెద్దిరెడ్డి చాలా సంతోషించాడు. కాని బంజారాలు పట్టువదల్లేదు ఎక్కడ కనబడ్డా తనను వాళ్లు పట్టిచ్చేలా ఉన్నారు. అందుకే తనీ అగ్గిపెట్టెలాంటి గాలి చొరని గదిలో.........

భరించలేక బయటకు వెల్దామనుకుంటున్న పెద్దిరెడ్డికి భయం పట్టుకుంది. మసకమసకగా అతడి కళ్లకు భూక్యా రక్తసిక్త మొండి చేతులు క్రమంగా తన వేపు దూసుకొస్తున్నట్లనిపించింది. మరో వేపు నుండి తెగి

పడిన భూక్యా చేతులు గాలిలో భయకరంగా నృత్యం చేస్తూ పెద్దిరెడ్డి వేపు దూసుకొస్తున్నాయి.

పెద్దిరెడ్డికి భయంతో రక్తపుపోటు హెచ్చింది. అంతలోనే భూక్యా హస్పిటల్లో ఉన్న విషయం గుర్తుకొచ్చింది. ఒకవేళ వాడె హస్పిటల్లోంచి పారిపోయొచ్చి తనమీద ప్రతీకారం తీసుకుంటున్నాడేమో. క్షణకాలం కళ్లు తిరిగినట్లయి మంచలో కూలబడ్డాడు. కొద్దిసేపు కళ్లు మూసుకున్నాడు రిలీఫ్ కని. కాని ఆలోచనలు మెదడుని తొలి చేస్తున్నాయి–గుండెనిండా భరించలేని భయం. ఈ భయం అతడు నేరం చేసినందుకు మాత్రంకాదు. చట్టం శిక్షిస్తుందని అయినా ఈ అధములకు తానెందుకు భయపడాలి? కొద్దికొద్దిగా కళ్లు తెరుస్తున్నాడు

ఈ మారు............

అతడి చుట్టూ కొన్ని జతల చేతులు నాట్యం చేస్తున్నాయి. ఆ జతలొక్కసారిగా వందలుగా మారి తన చుట్టూ కరాళ నృత్యం చేస్తున్నట్లు పెద్దిరెడ్డికి స్ఫురించసాగింది. ఆ చేతులన్నీ భయంకరంగా వ్రేళ్లను బిగదీసుకుంటూ ఉక్కుముక్కల్లా, పెద్ద సైజు పోత్కల్లా అతడి పైకొస్తున్నాయి. చాకుల్లాంటి వ్రేళ్లు తన గొంతును పొడిచేస్తాయి. అవును ఒకటే, ఒకటొకటే తన గొంతు మీదికొస్తున్నాయి. భయంకరంగా అరచి పెద్దిరెడ్డి కళ్లు మూసుకున్నాడు.

గొంతులో తడారి పోతుంది నిలబడే శక్తిలేక నరాలన్నీ బిగుసుకుపోతున్నట్లు ఫీలయి తూలిపడ్డాడు. సత్తువ కోసం ఏమైనా కావాలి. అప్పుడే గూట్లో దాచుకున్న సారా సీసా గుర్తుకొచ్చింది. వెంటనే లేచి వెళ్లి సీసాలోని సారా గటగటా తాగేసాడు. ఆ భయం వల్ల గొంతులో ఏమాత్రం మంట పుట్టించలేక పోయింది సారా. కాని లోనికెళ్లిన సారా చుక్కలు కొద్ది క్షణాల అనంతరం పెద్దిరెడ్డిలోని భయాన్ని క్రమంగా పారదోలసాగాయి; ఇప్పుడు పెద్దిరెడ్డి ధైర్యంగా నలు దిక్కులు పరికించి చూశాడు. ఇది వరకు అతడిచుట్టూ కరాళ నృత్యం చేసిన చేతులు క్రమంగా మసక మసకగా మారి చీకట్లో కలిసి పోయాయి

పెద్దిరెడ్డికి సారా నిషా వల్ల కొద్దిపాటి ధైర్యమొచ్చింది. మళ్లీ భూక్యాను లంబాడీ లంజా కొడుకంటూ బూతులు అందుకొన్నాడు భూక్యాతో పాటె పోలీసినస్పెక్టర్ గుర్తుకొచ్చాడు. అయినా ఈమారు భయపడలేదు. రాజకీయంగా తన పలుకుబడిని ఉపయోగించుకోవడానికి నమ్మకమైన మనిషిని పంపాడు హైద్రాబాద్‌కు. వాడీరాత్రికో, రేపొద్దటికో వస్తాడు, తననీ(కేసు)పీక నుండి తప్పిస్తాడు. సారా నిషా ఇంకా ఎక్కువయిపోయింది ఇప్పుడేమోమో ప్రేలుతున్నాడు భూక్యాను తిడుతూ.

తమ నాయకుడి చేతులు తెగనరికి తప్పించుకున్న అసలు ముద్దాయి పెద్దిరెడ్డి పని పట్టాలని సుగాలీలంతా చేతుల్లో గునపాలతో, పారలతో, కొడవళ్లతో, కర్రలతో పరిగెత్తుకొచ్చారు వాళ్లకెలా తెలిసిందోగాని పెద్దిరెడ్డి ఉన్న గది పైకొచ్చి బూతులు ఆడ్తూ బైటకు రమ్మంటున్నారు, వాళ్ల అరుపులు మహ భయకరంగా ఉన్నాయి.

పెద్దిరెడ్డి గది అవతల వేపు నుండి తాళం వేసి ఉంది. అతను చేసిన అరేంజిమెంటే. ఇంత పకడ్బందీగా ప్లాను వేస్తే వాళ్లకెలా తెలిసిందో. పెద్దిరెడ్డిలో ఉన్న ధైర్యం పూర్తిగా పోయి మళ్లీ భయం చోటు చేసుకుంది.

ఇంకా ఆ ఊళ్లోనే ఉన్న పోలీసులకు లంబాడీల విషయమెలా తెలిసిందో రంగంలోకి దిగారు. లేకపోతే పెద్దిరెడ్డిపై ఏ అఘాయిత్యం చేస్తారోనని వాళ్ల భయం-అందుకే దూరం నుండే విజిల్స్ వేస్తూ పరిగెత్తుకొచ్చారు.

కాని ఈ విజిల్స్ వాళ్ల మీదకన్నా పెద్దిరెడ్డి మీదే ఎక్కువ పని చేశాయి. భయంతో రక్తం గడ్డ కట్టుకు పోసాగింది.